

ఇళ్ల నిర్మాణాలకు స్థలాన్ని చూపండి

జెసిని కలిసిన ఎమ్మెల్సీ భరత్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కుప్పం ప్రాంతంలో ఇంటి స్థలాలకు సంబంధించి భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఎమ్మెల్సీ భరత్, రేస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ కోరారు. సోమవారం సాయంత్రం జిల్లా జెసి ఛాంబర్‌లో కలిసి ఇళ్లనిర్మాణాలకు సంబంధించిన స్థలాలు చూపాల్సిందిగా కోరుతూ వినతిపత్రం అందజేశారు. జెసి మాట్లాడుతూ 90 రోజుల ఇంటి స్థలాల కోసం పలువురు దరఖాస్తు చేయడం జరిగిందని, అర్హులైన వారిని గుర్తించి వారికి స్థలం పరిశీలించి ఎంపిక చేసి పంపిణీకి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.


జెసికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ

వేసవిలో జరభద్రం..!

- సూచనలు పాటిస్తే అగ్ని ప్రమాదాలు దూరం - 24 గంటలు అందుబాటులో అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ కనుక ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఏదైనా అగ్నిప్రమాదం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే 101 నెంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందిస్తే వెంటనే అగ్నిమాపక సిబ్బంది స్పందించి ప్రాణ, ఆస్తినష్టం తగ్గించే అవకాశం ఉంటుంది. కొన్ని జాగ్రత్తలు, సూచనలు పాటించడం ద్వారా ప్రమాదాలు జరుగకుండా చూసుకోవడం మంచిదని అగ్నిమాపక అధికారలు చెబుతున్నారు.



పాటించాల్సిన జాగ్రత్తలు..

వేసవికాలంలో అడవుల సమీపంలో నిప్పుపెట్టడం, పశుగ్రాసం కోసం కొండలు, గుట్టలకు నిప్పుపెట్టడం వంటి మానుకోవాలి. వంటగ్యాస్ వద్దకు చిన్నపిల్లలన్ని వె ళ్ళనివ్వ కూడదు. ఐఎస్ఐ మార్కు కలిగిన విద్యుత్ పరికరాలను మాత్రమే వినియోగించాలి. నాసిరకం విద్యుత్ తీగలను వాడకం వల్ల ఓవర్ లోడ్ కారణంగా షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. ఇటీవల కాలంలో అత్యధిక అగ్నిప్రమాదాలు షార్ట్‌సర్క్యూట్ కారణంగా చోటు చేసుకుంటున్నవే. ముఖ్యంగా ఆసుపత్రులు, సినిమా థియేటర్లు, షాపింగ్ మాల్స్, బట్టల దుకాణాలు, హోటళ్ళు, విద్యాసంస్థల్లో అగ్నిమాపక శాఖ ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. పొరపాటున అగ్నిప్రమాదం సంభవించినా ప్రజలు భయటపడేలా ముఖద్వారాలు ఏర్పాటు చేయాలి.

ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం..

అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జాతీయవిపత్తు అగ్నిమాపకశాఖ ప్రతి ఏడాది ఏప్రిల్ 14వ తేదీ నుండీ 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈమేరకు జిల్లాలోని ప్రతి అగ్నిమాపక స్టేషన్ సిబ్బంది ప్రమాదాల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ప్రమాదం సంభవించినప్పుడు ఎలా బయటపడాలో డెమో ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతోంది.

ఆసుపత్రుల్లో....

ప్రభుత్వ, ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రుల్లో విశాలమైన గదుల్లో రోగులకు ఉంచాలి. అలాగే ప్రమాదం సంభవించినప్పుడు రోగులను బయటకు పంపేందుకు రెండు లేదా మూడు ముఖద్వారాలను ఏర్పాటు చేసుకోవాలి. ఇసుక బకెట్లను ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ సరఫరా అయ్యే స్టేషన్ల వద్ద పరిశుభ్రంగా ఉంచాలి. కెపాసిటికి తగ్గటు విద్యుత్‌ను వినియోగించాలి. ఓవర్ లోడ్ సమయాల్లో షార్ట్‌సర్క్యూట్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రోగులను సురక్షిత ప్రదేశానికి తరలించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి, ఏసి, ఇతర విద్యుత్ ఉపకరణాలలో ఎలాంటి లోపాలు తతెత్తకుండా క్రమం తప్పకుండా పరీక్షిస్తుండాలి. ఆసుపత్రిలోని అగ్నిమాపక పరికరాలను సరిచూసుకోవడానికి, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ప్రతి అంతస్థులో ఫైర్‌వార్డెన్‌ను నియమించుకోవాలి. ఆసుపత్రిలోని బేస్‌మెంట్‌లతో మందుల దుకాణం నిషేధం, ఇతర మండే పదార్థలను నిల్వచేయరాదు. వంటగది, క్యాంటీన్ ఆసుపత్రి భవనంలో కాకుండా వేరే భవనంలో ఏర్పాటు చేసుకోవాలి. ఆసుపత్రిలోని డాక్టర్లు, నర్సులు ఇతర సిబ్బందికి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలో రోగులను సురక్షితంగా ఎలా తరలించాలో శిక్షణ ఇవ్వాలి.

హోటళ్లు, రెస్టారెంట్స్‌లో..

హోటళ్లు, రెస్టారెంట్స్ నిర్వాహకులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అగ్నిమాపక పరికాలను అన్ని వేళలా పనిచేసేలా ఉంచాలి. అగ్నిమాపక ప్లాన్ తెలిపే సూచనలుండాలి. ఎసీ ద్వారా మంటలు వ్యాప్తి చెందకుండా డ్యాంపర్స్‌ను ఏర్పాటు చేయాలి. విద్యుత్ ఉపకరణాలు క్రమం తప్పుకుండా చెక్ చేసుకోవాలి. వంటిగదిలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు

- పెద్దిరెడ్డి, జాతీయ విపత్తు అగ్నిమాపక జిల్లా అధికారి



ఇటీవల చాలా చోట్ల చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాలు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల జరుగుతున్నాయి. ఐఎస్ఐ మార్కు కలిగిన విద్యుత్ ఉపకరణాలను ఉపయోగించాలి. గ్రామీణ ప్రాంతాల్లో అడువులు, గుట్టలు, కొండలకు నిప్పుపెట్టడం మానుకోవాలి. ఉమ్మడి జిల్లాలో 16 అగ్నిమాపక కేంద్రాలు సేవలు ఉంటే... ప్రస్తుతం తిరుపతి జిల్లాలో 11, చిత్తూరు జిల్లాలో 5 ఫైర్ స్టేషన్లు 24 గంటలు సేవలు అందిస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో 6 అగ్నిప్రమాదాల సమయాల్లో నీరు తీసుకుపోయే వాహనాలు 1. రెస్క్యూవాహనం, 1. జీపు అందుబాటులో ఉంది. 95 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఈనెల 14వ తేది నుంచి 20వ తేదీ వరకు ప్రజలకు అగ్ని ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో కరపత్రాలు, డెమో ద్వారా అవగాహన కల్పించడం జరుగుతోంది. ఎక్కడైనా ఎలాంటి సందర్భంలోనైనా అగ్నిప్రమాదం సంభవించిన్నట్లైతే 101 నెంబర్‌కు సమాచారం అందించాలి.

104 వాహనాలతో వైద్య సేవలు

జెండా ఊపి ప్రారంభించిన జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


104 వాహనాలను ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే, జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆశయమని జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన 13 104 సంచార వైద్య వాహనాలను సోమవారం జిల్లా సచివాలయం ప్రాంగణంలో జడ్పీ ఛైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు నగర మేయర్ అముదలతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించబడిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా విలేజ్ హెల్త్‌క్లినిక్ హోంల ద్వారా గ్రామీణ ప్రజలకు ఉత్తమ సేవలు అందించుటకు గాను అక్టోబరు 2022లో మొదటివిడతలో 31 104 వాహనాలను, నేడు రెండవ విడతలో 13 వాహనాలను జిల్లాకు కేటాయించడం జరిగింది. జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ ఈ వాహనాల ద్వారా వైద్యులు గ్రామాలలోని ప్రతిఇంటికి వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, వైద్యచికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. చిత్తూరు ఎంఎల్ఏ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జేసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ అనేక సంస్కరణలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలకు సత్వరమే వైద్యసేవలను అందించేందుకు విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ ప్రకాశం, డిసిహెచ్ఎస్ నాయక్, డిఐఓ డాక్టర్ రవిరాజు, డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాస రావు, ఆర్‌బిఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, 104 నోడల్ అధికారి సందీప్, జిల్లా మేనేజర్ ప్రతాప్, అధికారులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

ఇక నాలుగు రోజులే గడువు..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలం పన్నులకు సంబంధించి పాత బకాయిలపై వడ్డీ మాఫీ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ కోరారు. వడ్డీ మాఫీ అవకాశం మార్చి నెలాఖరు వరకే వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పన్ను చెల్లింపులను అన్ని వార్డు సచివాలయాల్లోనూ, ఆన్లైన్లో, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా చెల్లించవచ్చని వివరించారు. నగరపాలక సంస్థ పరిధిలో పన్నుల వసూళ్లపై కమిషనర్ సూపర్వైజర్ అధికారులు, రెవెన్యూ అధికారులు, అడ్మిన్ కార్యదర్శుల బందాలతో సమీక్ష నిర్వహించారు. పన్ను చెల్లింపు గడువు సమీపిస్తున్న దష్ట్యా మొంది, పాత బకాయిల వసూళ్లపై ప్రత్యేక దష్టి సారించాలని ఆదేశించారు. వడ్డీ మాఫీ అంశాన్ని వివరించి పన్నులు కట్టించాలన్నారు. వార్డుల వారీగా ఆస్తి పన్ను డిమాండ్, వసూలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.

నేడు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం మంగళవారం ఉదయం 10.30గంటలకు జరుగుతుందని నగర మేయర్ ఎస్.అముద ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగే ఈసమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగాలి

జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి

ప్రజాశక్తి-కార్వేటినగరం: పోలీసులు సామాన్య ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి అన్నారు. సోమవారం కార్వేటినగరం పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో మమేకమై స్నేహపూర్వకంగా మెలుగుతూ నేరాల సంఖ్యను తగ్గించాలని ఆదేశించారు. అదే విధంగా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దష్టి సారించి ప్రమాదాలను అరికట్టాలన్నారు. హెల్మెట్ వాడకంపై వాహన చోదకులకు అవగాహన కల్పించి ప్రమాదాల్లో మత్యువాత పడకుండా చూడాలన్నారు. అదేవిధంగా వేసవి దష్య రాత్రి పూట ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేసి చోరీలు జరగకుండా చూడాలని పేర్కొన్నారు. కార్వేటినగరం సర్కిల్ పరిధిలో నేరాలు సంఖ్య తగ్గుముఖం పట్టిందని, సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ దస్తగిరిని అభినందించారు. అలాగే గతనెల శ్రీరంగరాజపురం మండలం క్షీరసముద్రం వద్ద జరిగిన భారీ చోరీ కేసును త్వరగ చేధించినందుకు డీఎస్పీ రవికుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, సీఐ చంద్రశేఖర్‌ను అభినందించారు. ఎస్పీ వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో అక్రమాలు

కలెక్టరేట్ ఎదుట కుప్పం ప్రజావేదిక నేతల ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వసతులున్నా ప్రభుత్వ వైద్యులు రెఫరల్ పేరుతో ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులను పంపుతున్నారని కుప్పం ప్రజావేదిక నాయకులు సోమవారం జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఎస్‌పి నాయకులు మహేష్, ప్రజా వేదిక నాయకులు మాట్లాడుతూ కుప్పం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు జబ్బులు లేని చిన్నపిల్లల్ని సైతం ఆరోగ్యశ్రీ కి రెఫరల్ చేస్తూ ప్రైవేట్ ఆసుపత్రులకు అక్రమమార్గంలో ఆదాయాలు చేకూర్చే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ఇలా కోట్లాది రూపాయలు ప్రజాధనం కాజేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవడంతో పాటు అనవసరంగా ఆరోగ్యశ్రీకి రెఫరల్ చేస్తున్న ప్రభుత్వ వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



స్పందనలో వినతుల వెల్లువ

స్పందనకు 349 అర్జీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందన కార్యక్రమంలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డిలతో కలసి జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనలో మొత్తం 349 అర్జీలు రాగా, ఇందులోరెవెన్యూ శాఖకు సంబంధించి 225, హౌసింగ్ శాఖ 13, వ్యవసాయ శాఖ 1, ఎస్ఎస్ఏ 1, ఎడిఎస్ ఎల్ఆర్ 2, రిజిస్టేషన్ అండ్ స్టాంప్ 1, డ్వామా 2, డిఎస్ఎల్ఆర్ఓ 2, డిఐసి శాఖ1, పశు సంవర్ధక శాఖ 1, హార్టికల్చర్ 1, ఇరిగేషన్ 1, మున్సిపల్ శాఖ1, ఎల్‌డిఎం 1, ఆర్ అండ్ బిశాఖ 1, పింఛన్లు, రేషన్‌కార్డ్స్ 85, ఇతరులు 10, అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు, జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓకు అందజేశారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద జిల్లా అధికారులు సత్వరం చర్యలు తీసుకుని పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు.


అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

'స్పందన' వినతులను పరిష్కరించాలి: కమిషనర్

స్పందన కార్యక్రమంలో అందే వినతులను క్షేత్రస్థాయిలో విచారించి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ నగర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. స్పందన వినతుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజారోగ్య విభాగం 2, ప్రణాళిక విభాగం 2, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఆరు వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ ధనలక్ష్మీ, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన : ఎస్పీ

ప్రజాసమస్యల పరిష్కార వేదికగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయరాదని జిల్లా ఎస్పీ వై.రిషాంత్ రెడ్డి అన్నారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 17 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 17 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ అడిషనల్ ఎస్పీ బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించేలా ఆదేశాలు జారీచేశారు. మొత్తం 17 ఫిర్యాదులు అందగా వీటిలో చీటింగ్ కేసులు 3, కుటుంబ తగాదాలు 2, భూ తగాదాలు 2, వేధింపులు 8, మిస్సింగ్ 1, ఆస్తి తగాదాలు 1 లకు సంబంధించిన వినతులను ఎస్పీ స్వీకరించారు.


ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ

కమ్యూనిటీ భవన సమస్యను పరిష్కరించండి

చిత్తూరుఅర్బన్: రెండు గ్రామాల మధ్య వివాదాస్పదంగా ఉన్న కమ్యూనిటీ భవన సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ ఐరాల మండలం కామినేనిపల్లె గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో గ్రామ కంఠంలో నిర్మించుకున్న కమ్యూనిటీ భవనాన్ని అక్రమంగా తమదంటు ఆక్రమించుకునేందుకు సమీప గ్రామస్తులు కుట్రలు చేస్తూ తమను ఇబ్బందులు గురి చేస్తున్నట్లు తెలిపారు. చట్టపరంగా గ్రామపరిధిలో ఉన్న కమ్యూనిటీ భవనం కామినేనిపల్లికే చెందుతుందని అనేకసార్లు రెవెన్యూ అధికారులకు దష్టికి కూడా తీసుకుపోవడం జరిగిందన్నారు. రెండు గ్రామాల మధ్య వివాదాస్పదంగా ఉన్న కమ్యూనిటీ భవనం తమ గ్రామానికి చెందిన జిల్లా ఉన్నతాధికారులు కల్పించుకొని న్యాయం చేయాలని కోరారు.

డ్రగ్స్ నియంత్రణపై దృష్టి సారించండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: డ్రగ్స్ నియంత్రణపై దృష్టి సారించి తయారీ, విక్రయ, సరఫరా కొనుగోలు చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని అనతపురం రేజ్ డిఐజి రవిప్రకాష్ పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం సత్యసాయి, అనంతపురం, తిరుపతి, చిత్తూరు జిల్లాల పోలీసు అధికారులతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. డ్రగ్స్ నియత్రణపై సమీక్షించారు. కేసుల్లో పలు రకాల నిందితులు ఉంటారని (అఫెండర్స్, పెడ్లర్స్, కంజ్యూమర్స్) ఇందులో కీలక నిందితులు ఎక్కడో ఉంటూ అమ్మేవారు, ఎక్కడో గంజాయి పండించి అమ్మేవారు, సరుకు రిసీవ్ చేసుకున్న వారు, ఎక్కడో ఉండి సరుకు బుక్ చేసుకునేవారు, ట్రాన్సుపోర్ట్ చేసిన వారితో పాటు లోకల్ పెడ్లర్స్ (గంజాయి, తదితర మాదక ద్రవ్యాలు అక్రమంగా లోకల్‌గా అమ్మేవారు) కూడా నిందితులుగా చేర్చాలన్నారు. కమర్షియల్ క్వాంటిటీ కేసుల్లో (20 కిలోల కంటే ఎక్కువ మోతాదులో ఉన్న గంజాయి) లోకల్ పెడ్లర్స్‌ను గుర్తించాలని, వీరికున్న కీలక నిందితులను లింకు చేయాలి. గంజాయిని వినియోగించే వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే తరుచూ... మూడు, అంతకంటే ఎన్‌డిపిఎస్ కేసుల్లో నిందితులుగా ఉంటే అలాంటి వారిపై పిడి యాక్టు పెట్టాలని ఆదేశించారు. ముఖ్య పట్టణాలలో గంజాయి, తదితర మత్తు పదార్థాల అనర్థాలపై హోర్డింగ్స్ పెట్టాలని, కళాశాలలకు వెళ్లి మత్తు పదార్థాలు-అనర్థాలపై కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన చేయాలన్నారు. ఎన్‌డిపిఎస్ కేసుల్లో బాగా పనిచేసిన వారికి రివార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. చెక్‌పోస్టులు, ప్రత్యేక దాడులు నిర్వహించి డ్రగ్స్ కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో చిత్తూరు, తిరుపతి, అనతపురం, అన్నమయ్య జిల్లాల ఎస్పీలు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఐజి రవిప్రకాష్

మహిళలకు టైలరింగ్‌తో ఉపాధి: డిఆర్‌డిఏ పీడీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మహిళలకు ప్రస్తుత పరిస్థితుల్లో మంచి ఉపాధినిచ్చేది టైలరింగ్ అని జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ తులసి అన్నారు. డిఆర్‌డిఏ జిల్లా యువజనశాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు 45 రోజులపాటు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వడం జరిగింది. సోమవారం శిక్షణ పూర్తి చేసుకున్న 25 మంది మహిళలకు డిఆర్డిఏ పిడి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈసందర్భంగా పిడి మాట్లాడుతూ డిఆర్‌డిఏ, జిల్లా యువజన శాఖ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని, దీన్ని సంఘసభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం టైలరింగ్ ద్వారా అనేకమంది మహిళలు రాణిస్తున్నారని, టైలరింగ్‌లో మంచి మెలకువలను నేర్చుకుంటే సులభతరంగా ఉపాధి పొందవచ్చుఅని తెలిపారు. ప్రస్తుతం టైలరింగ్ రంగానికి మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ టైలరింగ్‌లో శిక్షణ పొంది అన్ని అర్హతలున్న స్వయం సహాయక సంఘ సభ్యులకు పీఎంఈజీపి పథకం ద్వారా కుట్టుమిషన్లు ఇతర సామాగ్రి కోసం రుణాలు అందించే అవకాశం ఉందన్నారు. పీఎంఈజీపి పథకం ద్వారా అర్హత లేని సంఘ సభ్యులకు డిఆర్‌డిఏ ద్వారా రుణాలు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. స్వయం సహాయక సంఘ సభ్యులు ఈఅవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపిఎం వెంకటేష్, ఏపీఎం ఖాదరవల్లి పాల్గొన్నారు.


శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డిఆర్‌డిఏ పిడి తులసి

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రయత్నాలను తిప్పికొట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్ల ద్వారా వినియోగదారులకు తెలియకుండా విద్యుత్ భారాలు మోపాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఖండించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు లోడు, పీక్ డిమాండ్ పేరిట ప్రజలపై దొడ్డిదారిన విద్యుత్ భారాలు వేయాలని కేంద్రప్రభుత్వం యత్నిస్తోందని అన్నారు. కనెక్టెడ్ లోడ్ కన్నా ఎక్కువ వినియోగిస్తే ఆ మేరకు అదనంగా ఛార్జీలు వసూలు చేయాలని, డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో విద్యుత్ వినియోగిస్తే 20శాతం అధికంగా ఛార్జీలు వసూలు చేయాలని కేంద్రం ఆదేశించిందన్నారు. ఈ మేరకు తీసుకువచ్చిన ఎలక్ట్రసిటీ (రైట్ ఆఫ్ కన్స్యూమర్) సవరణ రూల్స్- 2023 ముసాయిదాపై ఏప్రిల్ 14 లోపు అభిప్రాయాలు చెప్పాలని రాష్ట్రాలను కోరిందన్నారు. విద్యుత్ వినియోగదార్లపై దొంగదెబ్బ తీసే ఈ ప్రతిపాదనలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదని అన్నారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తీసుకునే సమయంలో వినియోగదారు వాడుకునే విద్యుత్ ఉపకరణాలను బట్టి కిలో వాట్, 2 కిలోవాట్, 3 కిలోవాట్.. ఇలా లోడ్ ప్రకారం డిస్కంలు కనెక్షన్లు ఇస్తాయి. ప్రస్తుతం గృహ వినియోగదారుల నుంచి డిస్కంలు కిలోవాట్ లోడ్‌కు కన్సంషన్ డిపాజిట్ రూ.1750, రెండు కిలోవాట్స్‌కు రూ.3,750లు వసూలు చేస్తున్నాయని వినియోగదారుడు తీసుకున్న లోడ్‌కంటే అదనంగా మూడు నెలలు వాడకం పెరిగితే పెరిగిన కేటగిరీకి మార్చాలని తెలిపిందని, స్మార్ట్ మీటర్ల ద్వారా దీనిని లెక్కించాలని కేంద్రం తెలిపిందన్నారు. లోడ్ పెరిగితే కేటగిరీ మార్చాలన్న కేంద్రం తీసుకున్న లోడ్ కంటే తగ్గితే ఇవ్వాల్సిన మినహాయింపునకు మాత్రం వెసులుబాటు కల్పించకపోవడం కేంద్రం మోసకారితనాన్ని వెల్లడిస్తోందన్నారు. విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో వినియోగదారుల నుంచి 20శాతం అధికంగా చార్జీలు వసూలు చేయాలని, దీనికోసం ట్కెం ఆఫ్ డే (టిఓడి) విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. 2024 ఏప్రిల్ 1లోపు పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు, ఇతర వినియోగదారులకు 2025 ఏప్రిల్ 1లోపు ఈ విధానాన్ని అమలు చేయాలని గడువులు విధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ షరతులకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రయత్నాలను తిప్పికొట్టాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మహిళల ఆర్థికాభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో సోమవారం మాజీ ఏఎంసీ ఛైర్మన్ చిన్నమరెడ్డి అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా సంఘాలకు వైసీపీ నేతలు, అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. మహిళల సాధికారత కోసం అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేదోడు వంటి పథకాలలు, ఇళ్ల స్థలాల పట్టాలు మహిళల పేరుతో అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 1283 డ్వాక్రా సంఘాలకు రూ.15.48 కోట్ల చెక్ ను మండల సమైక్య అధ్యక్షురాలు జయశ్రీ ఐకెపి ఎపిఎం చిరంజీవిలకు డిప్యూటీ సీఎం అందజేశారు. ముందుగా మీటింగ్‌లోకి డిప్యూటీ సీఎం వస్తుండగా ఎంట్రన్స్ గేటు వద్ద మహిళలు కోలాటం ఆడుతుంటే వారి వద్ద కోలాటం కొయ్యలు తీసుకొని వైసీపీ నేతలతో కలిసి ఆయన కొంత సేపు కోలాటం డాన్స్ వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిత, పెనుమూరు ఏఎంసీ ఛైర్మన్ బండి కమలాకర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ వేలు మొదలియార్, ఎంపీడీవో శ్రీదేవి, తహశీల్దార్ ఇన్బనాధన్, మండల వైస్ ఎంపీపీ లు హరిబాబు, బేబీ, మాజీ మండల వైసిపి కన్వీనర్ సురేందర్ రెడ్డి, మండల సర్పంచ్ అధ్యక్షుడు ఏకాంబరం, నేతలు నరసింహులు నాయుడు, చిట్టిబాబు మొదలి, మోసెస్, జాన్ సుందరం, బ్రహ్మ తేజ, కేశవన్, పలువురు డ్వాక్రా సంఘాల మహిళలు, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ ఆసరా మండలంలోని 814 గ్రూపులకు రూ.7.42 కోట్ల చెక్కును రాష్ట్ర డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, రాష్ట్ర ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానంద రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హరిత కుప్పయ్య, డిసిసిబి డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, డిఆర్డిఎ పిడి తులసి, తహశీల్దారు లోకనాథ పిల్లై, ఎంపీడీవో కష్ణయ్య, ఏపీఎం రోజా, సంఘ మిత్రలు శ్రీధర్, విజయ్, గోపి, రఘు, నర్మద, సుబ్రమణ్యం, సీసీలు శివయ్య, లావణ్య, సుబ్రహ్మణ్యం, లోకనాథం, ఎంపీపీ సరిత, జెడ్పిటిసి ప్రసాద్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గురువారెడ్డి, విజయబాబు, జనార్ధన్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువులు వాడొద్దు



ప్రజాశక్తి-కార్వేటినగరం: మండలంలోని సుద్దగుంట గ్రామంలో జరుగుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రత్యేక శిబిరము 4వ రోజు స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా ప్లాస్టిక్ నిషేధిత కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సుద్దగుంట గ్రామ పరిసరాల్లో, రోడ్ల పక్కన పడేసిన ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ సుమారు 100 కేజీలు సేకరించి కార్వేటినగరం పంచాయతీ వారికి అందించారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌ను పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లక్ష్మీపతి సందర్శించి వాలంటీర్లకు ప్లాస్టిక్ వస్తువులు, కూల్ డ్రింక్స్ వాడటంతో కలిగే ఆరోగ్య సమస్యలు, ప్లాస్టిక్ వస్తువులు నిషేధించడం వంటి వాటిపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల భాధ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్ విజయులు రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధనంజయ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ జోగి ప్రసాద్, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాగ్రి పంపిణీ



ప్రజాశక్తి-నగరి: రాష్ట్ర వైసీపీ ట్రేడ్ యూనియన్ సెక్రటరీ, అనంతపురం జిల్లా ఎన్నికల పరిశీలకులు కేజే కుమార్ ఆధ్వర్యంలో స్థానిక పట్టణంలోని బీసీ హాస్టల్‌లో సోమవారం పేద విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. సూళ్లూరుపేటకు చెందిన బీసీ నాయకుడు కిరణ్, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కేజే శాంతి, కేజే కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, అట్టలు, పెన్నులు తదితర సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు 8 మంది విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-నగరి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలలో మండలం నుంచి 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో వారిని ఎంఈవో శ్రీదేవి అభినందించారు. ఎంపికైన వారిలో నెత్తం కండ్రిక ఎంపీపీఎస్‌కు చెందిన జనని, కేవీపీఆర్‌పేట ఎంపీపీఎస్‌కు చెందిన సతీష్ కుమార్, పుదుపేట ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య, కీర్తన, ఐశ్వర్య, చింతలపట్టెడ ఉన్నత పాఠశాలకు చెందిన సతీష్, తమిళ్‌సెల్వి, సత్రవాడ ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య ఉన్నారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలు, పుస్తకాలను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12వేలు చొప్పున నాలుగు సంవత్సరాలకు స్కాలర్‌షిప్ లభిస్తుందన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రసన్నకుమారి, నాధముని, కుప్పరాజు ఉపాధ్యాయులు మురుగప్పన్, అనిత పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తాం



ప్రజాశక్తి-కార్వేటినగరం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సామాజిక ఆరోగ్య కేంద్ర అభివద్ధికి కృషి చేస్తామని అభివద్ధి కమిటీ సభ్యుడు, ఎంపీపీ లతబాలాజీ అన్నారు. సోమవారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన అభివద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సౌకర్యాలు అందించడానికి 50 పడకల ఆస్పత్రిని మంజూరు చేశారని గుర్తు చేశారు. ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చూస్తామని పేర్కొన్నారు. సామాజిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ ఆస్పత్రుల అభివద్ధి సొసైటీ కన్వీనర్ డాక్టర్ భాగ్యలక్ష్మి, సొసైటీ సభ్యులు మోహన్ మురళీ, ధనంజయ వర్మ, అలాగే వికాస్ ఫార్మసిస్టు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన



ప్రజాశక్తి-యాదమరి: వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ సూచించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దసరా పల్లి గ్రామంలో ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిహెచ్ఓ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభమైందని ఎండలు విపరీతంగా కాస్తుండడంతో రైతులు, రైతు కూలీలు, పశువుల కాపర్లు, ఇతర పొలం పనులకు వెళ్లేవారు ఉదయం 10:30 గంటల్లోపు వారి పనులు ముగించుకొని ఇంటికి వచ్చేలా చూసుకోవాలన్నారు. ఒకవేళ ఎవరైనా వడదెబ్బ బారిన పడితే సత్వరం వారికి ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలన్నారు. ఈ ఒఆర్ఎస్ ప్యాకెట్లు గ్రామాల్లో మహిళా ఆరోగ్య, ఆశా, అంగన్వాడీ కార్యకర్తల వద్ద లభిస్తుందన్నారు.

తహశీల్దారుకి సన్మానం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన స్థానిక తహశీల్దారు లోకనాథ పిల్లై ని ఆర్‌టిఐ ఎఎస్ సభ్యులు పుష్పగుచ్ఛం, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు బండి పట్టాభి రెడ్డి, జాతీయ బోర్డ్ డైరెక్టర్ రామ్ ప్రకాష్, ఇన్‌ఛార్జ్ సెల్వరాజ్, మండల అధ్యక్షులు పట్టాభి, జిల్లా ఉపాధ్యక్షులు డైరెక్టర్ బాబు, హరినాథరెడ్డి, జిల్లా డైరెక్టర్ శంకర్, జాతీయ క్రమశిక్షణ ఉపాధ్యక్షులు మనోహర్, జిల్లా మహిళా కార్యదర్శి గీత, మండల డైరెక్టర్ బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇది ముమ్మాటికీ రాజకీయ కక్ష

ప్రజాశక్తి-పుంగనూరు: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వానికి అనర్హుడుగా ప్రకటించడం ముమ్మాటికీ రాజకీయ కక్ష అని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సబ్జాద్ బాష సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుజరాత్‌లోని సూరత్‌లోవి జిల్లా మెజిస్ట్రేట్ ఇచ్చిన తీర్పును ఆగ మేఘాల మీద అమలు చేయాలని హడావిడి చేయడం చూస్తే ఇది రాజకీయ దురుద్దేశమని తెలుస్తుందన్నారు. కేంద్రంలో బిజెపి నిరంకుశత్వాన్ని తీవ్రంగా ఖండిసున్నామన్నారు. దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతుందని దీన్ని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు.

నాడు-నేడు పనులకు రూ.2.40 కోట్లు మంజూరు



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలో రెండవ దశలో పాఠశాలలకు నాడు-నేడు పనులకు రూ.2.40 కోట్లు విడుదలైనట్లు సర్వ శిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి వెంకట రమణ రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం మండలంలో ఈ పథకంతో నిర్మాణ పనులు పరిశీలించటానికి విస్తతంగా పర్యటించారు. నిధులు విడుదలైనందున పనులు వేగంగా పూర్తి చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులుకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు జిల్లా అధికారి వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా మండలంలోని బైరెడ్డిపల్లి లోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, కడపనత్తం, తీర్థం పాఠశాలలను, దేవదొడ్డి గ్రామంలోని ఎంపియుపిఎస్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికల పాఠశాలలో వంట గది, టాయిలెట్ గది, ప్రహరీ గోడ, ఆర్ఎంఎస్ఎ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ వినయ్‌ను, బాలుర పాఠశాలలో నాబార్డు నిధులతో నిర్మించుచున్న భవనాన్ని, ఎస్ఎస్ఎ నిధులతో నిర్మిస్తున్న భవనాల నిర్మాణ పనులు పరిశీలించి సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కొన్ని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సాయిలీల, ప్రధానోపాధ్యాయులు గౌహర్ సుల్తానా, విశ్వనాధయ్య, నందగోపాల్ రెడ్డి, రత్నమ్మ, సుబ్రహ్మణ్యం, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఇర్షాద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత ధరలకే మద్యం విక్రయాలు



ప్రజాశక్తి-రొంపిచెర్ల: నిర్ణీత ధరలకే మద్యం విక్రయాలు జరపాలని, లేకుంటే చర్యలు తప్పవని చిత్తూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ దయాసాగర్ ప్రభుత్వ మద్యం దుకాణ సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం పీలేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచెర్ల మండలంలోని రెండు ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే మద్యం, బీరు సీసాలను మద్యం ప్రియులకు అమ్మకాలు జరపాలని కోరారు. తమ పరిధిలో ఎక్కడా అధిక రేట్లకు అమ్మడం లేదని మద్యం ప్రియుల ద్వారా విచారించడం జరిగిందన్నారు. మద్యం ధరలపై మద్యం కొనుగోలు చేసే వ్యక్తుల ద్వారా డెకాయట్ ఆపరేషన్ నిర్వహించామన్నారు. నిల్వ గల స్టాకును సిబ్బంది సహాయంతో ప్రతి బాక్సులు కిందికి దింపించి తనిఖీ చేయడం జరిగిందన్నారు. అలాగే షాప్‌కు సంబంధించిన మద్యం అవునా, కాదా అని పరిశీలించారు. మద్యం దుకాణాల్లో ఎప్పుడు తనిఖీలు నిర్వహించినా డిపో నుండి ఇచ్చిన స్టాక్, విక్రయాలు జరిపిన బాటిల్ లు, కౌంటర్లో నగదు సరిగా వుండాలని అన్నారు. అనంతరం రికార్డులు, షాపు నిర్వహణను చూసి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీల్లో అధికారులతో పాటు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నియామకం



ప్రజాశక్తి-పుంగనూరు: జిల్లా వాలీబాల్ సంఘ ఉపాధ్యక్షుడిగా ప్రముఖ వాలీబాల్ క్రీడాకారుడు, విశ్రాంత డిఎస్పి కల్వకుంట సుకుమార్ బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా వాలీబాల్ సంఘానికి ఎన్నికలు చిత్తూరు (డిఎస్ఎ) డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ భవనంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పుంగనూరు నుండి వైస్ ప్రెసిడెంట్ గా కనుమకుంట సుకుమారు బాబు, సంయుక్త కార్యదర్శిగా నానబాల గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ముస్తాక్, కమ్రుద్దీన్ ఎన్నికయ్యారు. కాగా గతంలో జిల్లా వాలీబాల్ సంఘ కార్యదర్శిగా ఉన్న మేలుపట్ల కష్ణారెడ్డి ఛైర్మన్ గా ఎంపికయ్యారు. ప్రెసిడెంట్‌గా చిత్తూరులో వ్యాయామ సంచాలకులుగా పని చేస్తున్న సిరాజుద్దీన్, కార్యదర్శిగా బంగారు పాళ్యంకు చెందిన సుదర్శన్ నాయుడు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు జయబాల మొదలి, భరత్ భూషణ్, కరీం సాహెబ్, వ్యాయామ సంచాలకులు చంద్రశేఖర్, నితిన్ కుమార్, అజయ్ కుమార్, జిల్లా వాల్మీకి సంఘ కార్యదర్శి అద్దాల నాగరాజు, ఆడిటర్ జయరాం, చందా రెడ్డప్ప రెడ్డి పాల్గొన్నారు. వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన కనుమకుంట సుకుమార్ బాబును చిత్తూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి, రామచంద్ర, పలువురు వాలీబాల్ క్రీడాకారులు జిల్లా వాల్మీకి సంఘ సభ్యులు అభినందించారు. ఎస్సీ, ఎస్టీ ఒట్రింగ్ కమిటీ సభ్యులు రాజా, ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ ఏడుకొండలు శాలువాతో సన్మానించారు.

మోడీ, జగన్ భారీ మూల్యం చెల్లించాల్సిందే.. : సిపిఐ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడాన్ని నిరశిస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు జనార్ధన్, నాగరాజులు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి కేంద్రమే నిర్మాణం చేపట్టి ఐదు సంవత్సరాల లోపు పూర్తి కావల్సి వుండగా నేటికి నత్తనడకన సాగడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంలో అలసత్వం, రాష్ట్ర ప్రభుత్వం కేసులకు భయపడి గట్టిగా నిలదీయలేకపోవడంతోనే ప్రాజెక్టు కుంటుపడుతోం దని పేర్కొన్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో త్వరిత గతిన పూర్తిస్థాయిలో చేపట్టాల్సిన ప్రాజెక్టును హఠాత్తుగా నేడు 150 అడుగుల ఎత్తు నుండి 130 అడుగులకు తగ్గించడం వల్ల ఈ ప్రాజెక్టు ఉనికే కోల్పోతుందని తెలిపారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గితే జాతీయ ప్రాజెక్టు, కేవలం రిజర్వాయర్‌గా మారి నీటి సరఫరా లేక రాయలసీమకు, ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టుల వల్ల భూములు, ఇల్లు కోల్పోయిన నిర్వాసితులను ఆదుకునేందుకు సైతం ముందుకు రాకపోవడం పేద ప్రజలు అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లెక్కలేని తనంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఫ్యామిలీ ఫిజీషియన్‌గా బాధ్యతలు చేపట్టినట్టు తుంబుకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చంగల్ రాయల్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ప్రజల ఇంటి వద్దకే వైద్యం కార్యక్రమం అందించేందుకు తుంబు కుప్పం ప్రాథమిక కేంద్రంనకు అదనంగా ఇద్దరు డాక్టర్లు లోకేష్, రమేష్ నూతనంగా నియమించిందన్నారు. ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు వారపు సంత వేలం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారపు సంత, ప్రైవేటు బస్టాండు నిర్వహణ కోసం మంగళవారం పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్ తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఉదయం 11 గంటలకు డివిజనల్ పంచాయతీ అధికారి వారి సూచనలు, నిబంధనల మేరకు పాల్గొనవచ్చుని ఆయన తెలిపారు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

ఘనంగా జాతీయ కార్పెంటర్స్ డే



ప్రజాశక్తి-సోమల: కార్పెంటర్స్ డే దినోత్సవాన్ని మండల కేంద్రమైన సదుం గ్రామంలో వడ్రంగి పని వారు ఘనంగా నిర్వహించారు. సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో బల్లలు, కిటికీలు, తలుపులు, మరమ్మతులకు గురైన వాటిని స్వచ్ఛందంగా బాగు చేసి తమ సేవా నిరతిని చాటారు. దీంతో వారిని ప్రధానోపాధ్యాయులు ఫజురుల్లా అభినందించారు. అంతకుముందు సదుం గ్రామంలో వడ్రంగులంతా కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్పెంటర్స్ కన్వీనర్ మహబూబ్ బాషా, ఉపాధ్యక్షుడు అల్తాఫ్, కార్యదర్శి కేశవాచారి, ఉప కార్యదర్శి హరి, సభ్యులు అన్సర్ బాష, జబీర్, మురళీ కష్ణమాచారి, బాలకష్ణ, భీష్మ చారి, మనోజ్ కుమార్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల రక్షణకే మానిటరింగ్ కమిటీ

ప్రజాశక్తి-నగరి: ఎస్సీ, ఎస్టీల రక్షణకే విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఉందని జిల్లా స్థాయి కమిటీ సభ్యులు పి.బాబు అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సుజన అధ్యక్షతన నిర్వహించిన డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఇతర సమస్యల గురించి చర్చించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీలకు ఉన్న చట్టాలను వివరించారు. మానిటరింగ్ కమిటీ ఎప్పుడూ వారికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎ.దేవరాజులు, వి.రాజ్‌కుమార్, ఎం.డేవిడ్, డివిజన్ పరిధిలోని తహశీల్దార్‌లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన తనిఖీ



ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ, సిబ్బంది హాజరు, నాడు నేడు పనులను ఎంఈఓ కేశవ పిళ్లై సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వడ్డించాలని సిబ్బందిని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మండలానికి సముచిత స్థానం




ప్రజాశక్తి-వి.కోట: యుటిఎఫ్ జిల్లా నూతన కార్యవర్గంలో మండలానికి సముచిత స్థానం లభించిందని జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరులో నిర్వహించిన 47వ యుటిఎఫ్ జిల్లా సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. చింతల ఎల్లాగరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు జి వి రమణను జిల్లా ప్రధాన కార్యదర్శిగా 6వ సారి ఎన్నుకున్నారు. ఎర్రి నాగేపల్లి ఉన్నత పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు ఏ కష్ణమూర్తి జిల్లా కార్యదర్శిగా మూడవ సారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కషిచేస్తామని వారు తెలిపారు. వీరి ఎన్నికపై యుటిఎఫ్ మండల ఉపాధ్యాయ నాయకులు గజేంద్రరవ్, చంద్రశేఖర్, లీలకుమార్, నిర్మల, నిజ లింగప్ప, మణికంఠ, శ్రీనివాసులు, శివశంకర్, మున య్య, పవన్ తదితర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

'చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-పలమనేరు: దేశంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ, ఏప్రిల్ 5న ఢిల్లీలోని రామ్లీలా మైదానంలో 10 లక్షల మంది కార్మికులు, రైతులతో కలిసి భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్ రాజు తెలిపారు. సిఐటియు, ఎపి వ్యవసాయ కార్మికులు చలో ఢిల్లీ పోస్టర్‌ను కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్ రూ.10 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గిరిధర్ గుప్తా, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాకాల సుబ్రహ్మణ్యం, గుర్రం సుబ్రహ్మణ్యం, సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేష్ ది లక్కీ లెగ్..!



ప్రజాశక్తి-వెదురుకుప్పం: రాష్ట్రంలో నలుగురు టిడిపి ఎమ్మెల్సీలు గెలవడంతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ది లక్కీ లెగ్గని తెలిపోయిందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్ బి సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో సోమవారం చెప్పారు. జనవరి 27 న కుప్పంలో ప్రారంభమైన ఆయన పాదయాత్ర ఉమ్మడి చిత్తూరు జిల్లా దాటకముందే మూడు పట్టభద్రుల నియోజకవర్గాలలో టిడిపి అభ్యర్థులు ఎమ్మెల్సీలుగా గెలిచారని చెప్పారు. అనంతపురం జిల్లాలో పాదయాత్ర ప్రారంభం కాగానే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ టిడిపి అభ్యర్థి గెలిచారని తెలిపారు. ఇదంతా లోకేష్ పాదయాత్ర మహిమ అన్నది వైకాపా నేతలు గుర్తించాలని చెప్పారు. ఈ ఫలితాలను చూసిన తరువాత అయినా మంత్రి రోజా వక్రబుద్ధితో లోకేష్ పై విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. టిడిపి ఏర్పడిన 40 ఏళ్లలో తొలి సారిగా పశ్చిమ, తూర్పు రాయల సీమ పట్టభద్రుల నియోజకవర్గాలలో పార్టీ అభ్యర్థులు గెలిచారని చెప్పారు.

ఆర్టీసీ డిపో నిర్వీర్యం

ప్రజాశక్తి-పలమనేరు: క్రమక్రమంగా స్థానిక ఆర్టీసీ డిపోలోని బస్సులను, సర్వీసులను రద్దు చేస్తూ నిర్వీర్యం చేస్తున్నారని పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు ఆరోపించారు. చిత్తూరు జిల్లా ప్రజా రవాణా అధికారిని చిత్తూరులో కలిసి రద్దు చేసిన ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులు పునరుద్ధరించాలని, అదేవిధంగా వేలూరు, తిరుపతి, బెంగళూరు నగరాలకు పలమనేరు డిపో నుండి బస్సు సర్వీసులు నడుపుటకు చర్యలు తీసుకోవాలని, ఉదయం వేళల్లో తిరుపతి రుయా, స్విమ్స్, వేలూరు సీఎంసి హాస్పిటల్ కి చికిత్సకు వెళ్లే వారికి కూడా బస్సులు లేకుండా పోవడం బాధాకరమన్నారు. ఇటువంటి సర్వీసులు మళ్లీ నడపాలని వీరు డిమాండ్ చేశారు. అట్లు లేని యెడల ప్రజా భాగస్వామ్యంతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమితి కార్యదర్శి నరసింహులు దమనమని, నారాయణ, నారాయణ, సన్నీ రాజు, సుబ్రహ్మణ్యం, రెడ్డప్ప, వెంకటాచలపతి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలం కేంద్రంలో ఈనెల 29న జరగబోయే వైఎస్సార్ ఆసరా వారోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ బాగారెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించడానికి సన్నాహాలు, స్థల పరిశీలనను మండల పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గహసారథులు, నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళ సంఘ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసిన సంఘటన మండలంలో సోమవారం చేసుకుంది. వివరాలు... మండల పరిధిలోని పుంగనూరు-బైరెడ్డిపల్లి జాతీయ రహదారిలోని బెల్లమడుగు క్రాస్‌లో కర్ణాటక మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ వెంకట నరసింహులు తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని చేరుకొని దాడులు నిర్వహించగా టీవీఎస్ ఎక్సెల్ హెవీ డ్యూటీను తనిఖీ చేయగా 90 ఎంఎల్ కర్ణాటక మద్యం 38 డేటా ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించారు. కష్ణా రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా నారాయణప్ప 90 ఎం ఎల్ కర్ణాటక మద్యం 33 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై వెంకట నరసింహులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

జనావాసాల్లోకి క్రిష్ణ జింక



ప్రజాశక్తి-కార్వేటినగరం: వేసవి సంభవించడంతో తాగునీటి కోసం జనావాసాల్లోకి క్రిష్ణ జింక వచ్చిన సంఘటన మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయానికి కూత వేటు దూరంలోని బీసీ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలిలా... అటవీ ప్రాంతం నుండి తాగునీటి కోసం గ్రామానికి వచ్చిన క్రిష్ణ జింకను వీధి కుక్కలు దాడికి యత్నించడంతో జింక ఓ ఇంటి ఆవరణానికి చేరుకుంది. దీంతో ఆ కుటుంబ సభ్యులు పంచాయతీ ఇఒ పీఎస్ మణికి సమాచారం అందించడంతో స్పందించిన పంచాయతీ ఇఒ అక్కడికి చేరుకుని సంబంధిత అధికారులకు తక్షణమే సమాచారం అందించారని ఆర్ఒ తెలిపారు. దీంతో క్రిష్ణ జింకను కుప్పాని గుంట అటవీ ప్రాంతంలో వదిలి పెట్టినట్లు పేర్కొన్నారు.

సీజ్ చేసిన వాహనాల వేలం



ప్రజాశక్తి-నగరి: వివిధ కేసుల్లో సీజ్ చేసి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీస్ స్టేషన్‌కు తరలించిన వాహనాలకు సోమవారం వేలం వేశారు. చిత్తూరు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహించారు. 18 ద్విచక్ర వాహనాలను వేలానికి ఉంచగా 16 వాహనాలను వేలందారులు వేలంలో సొంతం చేసుకున్నారు. ఈ వాహనాలకు జీఎస్టీతో కలిపి రూ.1,72,630 లు వసూలైనట్లు నగరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీస్ స్టేషన్ సీఐ వర్ధనదేవి తెలిపారు. ఈ వేలంలో ఎస్సై భాను ప్రకాష్, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటలను రక్షించాలి



ప్రజాశక్తి-సోమల: సదుం మండలంలో రెండు రోజులుగా పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. ఏనుగుల దాడులతో రైతులు ఆర్థికంగా నష్టాన్ని చవి చూస్తున్నారు. ఆదివారం రాత్రి చెరుకు వారి పల్లి గ్రామానికి చెందిన పలువురు రైతుల వరి, చెరకు పంటలపై దాడి చేసి తీవ్ర నష్టాన్ని కలిగించాయని రైతులు సోమవారం తెలిపారు. బ్రహ్మానంద రెడ్డి, శకుంతలమ్మ, గురి కాని వారి పల్లెకు చెందిన మునిశేఖర్ అనే రైతుల పంట పొలాలపై ఏనుగుల మంద దాడి చేసి తీవ్ర నష్టాన్ని కలిగించాయి. విషయాన్ని తెలుసుకున్న వీఆర్వో పురుషోత్తం సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించి, ఏఏ పంట, ఎంత మేర నష్టం జరిగిందనే వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆరు కాలం కష్టించి పండించిన పంటలు ఏనుగుల దాడితో నష్టపోతున్నా మన్నారు. ప్రభుత్వం ఏనుగుల భారి నుండి శాశ్వత పరిష్కారాన్ని చూపించి తమను ఆదుకోవాలని కోరారు.

భూములకు భద్రత కల్పించండి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: భూములకు భద్రత కల్పించాలని జయంతి గ్రామ గిరిజనులు సోమవారం ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి లకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జయంతి గ్రామస్తులు నాగేంద్రబాబు మాట్లాడుతూ కొత్తగా చెన్నై-బెంగుళూరు కారిడార్ పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థ వారి స్వార్థ ప్రయోజనాలకు గ్రామ పంచాయతీలోని షెడ్యూల్డ్ కులాల వారికి ప్రభుత్వం ఇచ్చిన భూములలో ఇష్టానుసారంగా మట్టిని తీసి భూములను సాగుకు పనికి రాకుండా చేస్తున్నారని, వాటి మీదే ఆధారపడి జీవిస్తున్నామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మాకు తగు న్యాయం చేయాలని కోరారు.

పొలం పరిసరాలపై అవగాహన

ప్రజాశక్తి-పలమనేరు: పొలం పరిసరాలపై రైతు భరోసా సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారిణి సంధ్య తెలిపారు. సోమవారం మండలంలోని గ్రామ పంచాయతీ కంబి రెడ్డి వరి పొలంలో పొలంబడి కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా సిబ్బంది పొలం పరిసరాలు విశ్లేషణపై అవగాహన కల్పించి, స్వయంగా పొలంలో దిగి పంటకు మేలు చేసే మిత్ర పురుగులను, కీడు చేసే శత్రు పురుగులను గమనించి ఛార్ట్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పొలంబడి వరి పంట ప్రస్తుతానికి ఆరోగ్యంగా ఉన్నందున ఎలాంటి పురుగు మందులు పిచికారి అవసరం లేదని, పొలంలో జిగరు అట్టలు పెట్టడంతో, చీడపీడల నివారణ చర్యలు తీసుకోవడం మంచిదని రైతులకు అవగాహన కల్పించారు.